క్లుప్తంగా

ప్రజలకు సురక్షిత నీటిని అందిస్తాం

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రజలకు సురక్షితమైన నీటిని అందించటమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలో సోమవారం వివిధ ప్రాంతాలలో ఉన్న 4 వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణంలోని ప్రజలు కలుషితమైన వాటర్ తాగకుండా ఉండేందుకు వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయటమే కాకుండా, వాటర్ పైపులను కూడా కెమికల్స్ ద్వారా శుభ్రం చేయటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హిందీ ప్రవీణలో ప్రతిభ



గురజాల : దక్షిణ భారత హిందీ ప్రచార్ సభమద్రాస్ నందు గత నెలలో జరిగిన డి.బి.హెచ్.పి లో గురజాలకు చెందిన మట్టపల్లి మన్విత రియా మొదటి ర్యాంకు సాధించినట్లు హిందీ పండిట్ ఎం.రవికుమార్ తెలిపారు. గురజాలలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎం.మన్విత రియా చిన్నతనంలోనే హిందీ భాషపై పట్టు సాధించినట్లు చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ మన్నెం కృష్ణ అభినందించారు. హిందీలో పరిచయ, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద పూర్వార్థ, విశారద ఉత్తరార్థ, ప్రవీణ పూర్వార్థ, ప్రవీణ ఉత్తరార్థలో మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. విద్యార్థినిని పలువురు అభినందించారు.

నడిచేదెలా..?



కారెంపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న బ్రిడ్జి ఫుట్ పాత్‌లు పాడైపోయి పాదచారులు నడిచేటప్పుడు పడిపోతున్నారు. బస్టాండ్ సెంటర్ నాగులేరుపై నిర్మించిన బ్రిడ్జిపై నుంచే రాకపోకలు భారీగా జరుగుతుంటాయి. ఫుట్ పాత్‌లపై తప్పితే కింద రోడ్డుపై నడవడానికి వీల్లేనంతగా ట్రాఫిక్ ఉంటుంది. మరో వైపు బ్రిడ్జికి ఇరువైపులా వేసిన ఫుట్ పాత్‌లు చాలా వరకు దెబ్బతిన్నాయి. సిమెంట్ కాంక్రీటు అచ్చులు పగిలిపోయాయి. కొన్ని కుంగిపోయాయి. ఏ మాత్రం ఏమరపాటుగా నడచినా పడిపోతున్నారు. పైగా పల్నాటి వీరారాధన ఉత్సవాలు జరగనున్నాయి. లక్షలాదిగా జనం తరలివస్తారు. అప్పుడు ఇక్కడ చాలా ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంటుంది. దీనికి తోడు బ్రిడ్జి కింద పిల్లర్స్‌పై రావి, మర్రి చెట్లు మొలిచి పెద్దవి అవుతున్నాయి. బ్రిడ్జిపై మట్టి పేరుకుపోయి వర్షపు నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కానాలు పూడిపోయాయి. దీంతో నీరు బ్రిడ్జిపై నిలిచిపోతోంది. బ్రిడ్జిపై విద్యుత్తు లైట్లు లేవు. సైడ్ రెయిలింగ్ కూడా పెచ్చులూడిపాడైపోతోంది.

మహిళా సంక్షేమమే టీడీపీ లక్ష్యం



మాచర్ల రూరల్: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మెప్మా భవనంలో దీపం పథకం ద్వారా లబ్ధిదారులకు సిలిండర్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మహిళలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసిన ఘనత చంద్రబాబు నాయుడిదేనన్నారు. టీడీపి ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను వరుస క్రమంలో అమలు చేసుకుంటూ అభివృద్ధి పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మహిళలంతా మా మంచి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమీషనర్ వేణుబాబు, కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, సూరె యలమంద ఉన్నారు.

బెల్టుషాపులో 8 మద్యం బాటిళ్లు స్వాధీనం

అమరావతి: మండల పరిధిలోని నెమలికల్లు గ్రామంలో మద్యం బెల్టుషాపుపై దాడి చేసి పెదకూరపాడు ఎక్సైజ్ పోలీసులు ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నెమలికల్లు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఎస్‌కే జాన్‌సైదా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 8 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

క్షీణిస్తున్న ప్రజారోగ్యం

- గతంలో 'జగనన్న సురక్ష'తో ఇంటికే వైద్య సేవలు
- స్పెషలిస్ట్ వైద్యులతో అత్యాధునిక వైద్య సేవలు
- ఉచితంగా పరీక్షల నిర్వహణ, మందులు పంపిణీ
- పల్లె ప్రజల ఆరోగ్యానికి భరోసానిచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ప్రతి గ్రామానికి మద్యం చేరువ చేసిన కూటమి ప్రభుత్వం
- మద్యం మీద ఉన్న శ్రద్ధ.. ప్రజారోగ్యంపై లేదని విమర్శలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓపీకి బారులు తీరిన ప్రజలు (ఫైల్)

గురజాల: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రజలకు వైద్య సేవలు అందించారు. అన్ని గ్రామాల్లో టైం టేబుల్ ప్రకారం స్పెషలిస్టు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మంచానికి పరిమితమై రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. నిపుణులైన వైద్యులు 14 రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య శ్రీ ఉంటే సంబంధిత శస్త్ర చికిత్స కోసం వైద్యశాలకు రిఫర్ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య సేవలను గాలికొదిలేయడంతో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో నిరుపేదలకు వైద్యం భారంగా మారింది.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. గత ప్రభుత్వం చేపట్టిన వైద్య విధానంలోని కార్యక్రమాలను ఈ ప్రభుత్వం కూడా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పడకేసిన పల్లె వైద్యం

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. నూతన మద్యం విధానంతో మద్యాన్ని ఏరులై పారిస్తున్న సర్కార్ ఆధునిక వైద్య సేవలకు పల్లె ప్రజలు క్రమేపీ దూరం చేస్తోంది. బెల్ట్ షాపులతో ఇంటింటికీ మద్యం చేరవేసేందుకు ఉన్న శ్రద్ధ.. ఇంటింటికీ వైద్యం అందించడంపై లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాధులొస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం



జగనన్న ఆరోగ్య సురక్షలో గుండె పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

వైద్య విధానంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. చిన్నపిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ సైతం గ్రామాల్లోని వైద్య పరీక్షలకు అందుబాటులో ఉండేలా చేపట్టారు.

నిఘా నేత్రంలో మాచర్ల పట్టణం

మాచర్ల రూరల్: నేరాల నియంత్రణ, ఘర్షణలు, చోరీలు, అవాంఛనీయ ఘటనలు, శాంతి భద్రతల పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిర్వాహణ ఎంతగానో ఉపయోగపడుతుంది. సీసీ కెమెరాలలో దృశ్యాలు కేసుల పరిశీలనతో పాటు నిందితులను గుర్తించేందుకు కీలకపాత్ర పోషిస్తాయి. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పల్నాడులోని మాచర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో పట్టణంలో ప్రధాన కూడళ్లలో పోలీసులు సుమారు 50 కెమెరాలకు పైగా అమరుస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు జాతీయ, రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాల వద్ద కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ పి.ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణంలో సుమారు 50కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రధాన వీధుల్లో, విగ్రహాల వద్ద ఈ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసు స్టేషన్‌లో కంట్రోల్ రూంలో టీవీలో ప్రతీది రికార్డు చేస్తున్నామని చెప్పారు.



పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాటు



సీఐ పచ్చిపాల ప్రభాకర్

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఈ కెమెరాలు బిగిస్తున్నామన్నారు. వీటి ద్వారా పట్టణాన్ని తమ కంట్రోల్‌లోకి తీసుకొచ్చి శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు దోహదపడుతుందన్నారు.

పట్టణాభివృద్ధే కూటమి లక్ష్యం

మాచర్ల రూరల్: మాచర్ల పట్టణాన్ని అన్నీ విధాలా అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం పురపాలక సంఘ సాధారణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బుగ్గవాగు నీటిని తీసుకువస్తామని, అలాగే పంపు హౌస్ లో నూతన విద్యుత్ పరికరాలు, మోటార్లను కొనుగోలు చేసి పట్టణంలో కుక్కల బెడదను తగ్గించేందుకు రేబిస్ వ్యాక్సిన్‌ను కొనుగోలుకు సమావేశం ఆమోదం తెలిపింది. ప్రధాన మురుగు కాలువలలో పూడికతీత పనులు, పారిశుధ్య పనులను చేపట్టి మురుగును తొలగించేందుకు టెండర్లను ఖరారు చేయాలని కోరారు. పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, సకాలంలో పన్నులు చెల్లించి పారిశుధ్య నిర్మూలనలో ప్రతి ఒక్కరూ వీధుల్లో



సమావేశంలో ఎమ్మెల్యే జేబీఆర్, చైర్మన్ నరసింహారావు

చెత్తను పారవేయకుండా పారిశుధ్య కార్మికులకు, డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు పోలా శ్రీనివాసరావు, మందా సామేలు, మేకపోతుల రామాంజిరెడ్డి, గట్ల అరుణ, సుభాని, దస్తగిరి, కమీషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, ఆర్ఐ వెంగయ్య పాల్గొన్నారు.

క్వింటా పత్తిని రూ.10 వేలకు కొనుగోలు చేయాలి

రైతు సంఘం నాయకులు

పెదకూరపాడు: క్వింటా పత్తి రూ.10 వేలకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు అన్నారు. పెదకూరపాడు తహసీల్దార్ దానియల్‌ను సోమవారం రైతులు, దర్శి శేషారావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ సీసీఐ పత్తి కొనుగోలును వెంటనే ప్రారంభించాలన్నారు. తేమ శాతం నిబంధనలు సడలించి రైతు వద్ద ఉన్న పత్తిని క్వింటా రూ.10 వేలకు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,521 నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పత్తి పంట తీవ్రంగా దెబ్బతిని దిగుబడి పూర్తిగా పడిపోయిందన్నారు. కౌలు రైతులకు కౌలు



తహసీల్దార్ దానియేలుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

గుర్తింపు కార్డులు అందలేదని, వారికి వ్యవసాయ శాఖ అధికారి ధ్రువీకరణ పత్రంతో పత్తి కొనుగోలుకు సహకరించాలని కోరారు. తహసీల్దారును కలిసిన వారిలో ప్రతినిధులు ఏ వెంకట కృష్ణారావు, ఎం.మస్తానావు, షేక్ జానీ బాషా, ఎం.నరసింహారావు, నరేష్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రులు త్వరితగతిన ఓటు నమోదు చేసుకోవాలి

- ఈ నెల 6 వరకే దరఖాస్తుకు అవకాశం
- సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి

సత్తెనపల్లి: పట్టభద్రులంతా త్వరితగతిన ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులందరి చేత ఓటు హక్కుకు దరఖాస్తులు చేయించాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సత్తెనపల్లి మండలంలో ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 1,111 మంది, 428 మంది ఆఫ్‌లైన్ ద్వారా మొత్తం 1,539 మంది దరఖాస్తు చేశారన్నారు. అత్యధికంగా గుడిపూడి గ్రామంలో ఆన్‌లైన్ ద్వారా 184 మంది దరఖాస్తు చేస్తే, ఆఫ్‌లైన్ ద్వారా అత్యధికంగా రెంటపాళ్ల గ్రామం నుంచి 88 మంది దరఖాస్తు చేశారన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోసుబాబు, సత్తెనపల్లి రూరల్ మండలంలోని బీఎల్వోలు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

నకరికల్లు: గత ఏడాది 2023-24లో చేపట్టిన ఉపాధి హామీ పనుల నాణ్యతపై సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలు, కూలీల అభిప్రాయాలు సేకరించనున్నట్లు ఎస్ఆర్‌పీ ఎం.లోకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు రూ.8.14 కోట్లు వెచ్చించి ఉపాధిపనులు చేపట్టారని వాటిలో కూలీలకు రూ.7.79 కోట్లు, మెటీరియల్‌కు రూ.34.51 లక్షలు వెచ్చించారన్నారు. ఈ నెల 5వ తేదీన నర్సింగపాడు, 7న చీమలమర్రి, 8న కుంకలగుంట, అడ్డరోడ్డు, చేజర్ల గ్రామాల్లో, 9న రూపెనగుంట్ల, 10న గుండ్లపల్లి, నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లో, 11వ తేదీన కండ్లకుంట, 12న బాలాజీనగర్‌తండా, దేచవరం, చాగల్లు, తురకపాలెం గ్రామాల్లో, 13న శివాపురంతండా, త్రిపురాపురం, జిల్లాపేటతండాలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాలుగు అర్జీలు



మాచర్ల రూరల్: బాలికపై అత్యాచారం చేసిన శ్రీనివాసరావు పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎంసీపీఐ నాయకుడు పి.అబ్రహం లింకన్, పోలేపల్లి రెబ్బమ్మ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. బీసీ–డి చెందిన శ్రీనివాస రావు అనే వ్యక్తి ఎస్టీ చెంచు కింద నకిలీ సర్టిఫికెట్ పొంది ప్రభుత్వ ఉద్యోగం నిర్వహిస్తున్నాడన్నారు. బాలిక పై లైంగిక దాడి చేసిన కేసులో బెయిల్ రద్దు చేసి ఎస్‌సి ఎస్‌టి కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. పట్టణంలో కోతులు, కుక్కల బెడద తొలగించాలని 13వ వార్డుకు చెందిన తిరివీధి నాగేశ్వరరావు కోరారు. అలాగే మరో రెండు అర్జీలు అందజేసినట్లు తెలిపారు.

వైభవంగా కార్తిక మాస పూజలు




విజయపురిసౌత్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారంస్థానిక చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు జూనూతల ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముందుగా భక్తులు సాగర్ కృష్ణా జలాశయంలో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జూనూతల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మీరు తవ్వుకుంటే మేము చూస్తుండాలా?

గురజాల : గత కొద్ది రోజులుగా మండల పరిధిలోని దైద గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు జరిపి, గ్రావెల్‌ను తరలిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం తేలుకుట్ల, దైద గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయినర్‌ను అడ్డుకున్నారు. తమ గ్రామానికి అందరూ వచ్చి గ్రావెల్ తవ్వుకుని వెళ్తుంటే తాము చూస్తుండిపోవాలా? అని డ్రైవర్‌ను దుర్భాషలాడారు.

24న యాదవుల కార్తిక సమారాధన



యాదవ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

మాచర్ల రూరల్: ఈ నెల 24న యాదవుల కార్తిక వన సమారాధనకు పెద్ద ఎత్తున తరలిరావాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, న్యాయవాది గొర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీతారామాలయంలో నిర్వహించిన యాదవుల సమావేశంలో వారు మాట్లాడారు. శివునికి ప్రీతి పాత్రమైన కార్తీకమాసంలో యాదవ కుటుంబ సభ్యులంతా కలసి ఒక్క చోటకు చేరి నిర్వహించుకునే కార్తీక వనభోజనాలకు రాష్ట్రంలోని అన్నీ పార్టీలకు చెందిన యాదవ సంఘ నాయకులను ఆహ్వానించనున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ జింకల నాగేశ్వరరావు, కామనబోయిన నాగరాజు, మురళి, గుండాల శ్రీనివాసరావు, వీరాస్వామి, హరిబాబు, సింగు నాగేశ్వరరావు, సురేష్, సైదులు, రామయ్య, మున్నా రాంబాబు తదితరులున్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు



సత్రశాల మల్లికార్జునస్వామి దేవస్థానంలో అన్నదానం

గురజాల: కార్తీక మాసం సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని దైద గ్రామంలో కృష్ణానది ఒడ్డున అమరలింగేశ్వర స్వామి దేవాలయం, గోగులపాడు శివాలయం, గురజాల వీరభద్ర స్వామి దేవాలయం, గంగా పార్వతి సమేత ఇష్టకామేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. దైద గ్రామంలో గల అమరలింగేశ్వర స్వామి దేవాయానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. వేకువ జాము నుంచి భక్తులు కృష్ణా నదిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణానది స్నాన ఘాట్, దేవాలయం వద్ద సీఐ పి.భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ వై.వినోద్ కుమార్ బందోబస్తు నిర్వహించి పరిశీలించారు.

భక్తులు ప్రత్యేక పూజలు

రెంటచింతల: ప్రముఖ శైవ క్షేత్రమైన సత్రశాల శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తిక మాస తొలి సోమవారం సందర్భంగా వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నస్వామిని దర్శించుకున్న భక్తులకు, మాలదారులకు మహాన్నదానం చేశారు. అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్ర, గణపతి హోమాలను నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో కార్తిక స్నానాలు ఆచరించారు. శివ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. అనంతరం అన్నదానం చేసిన దాతలను ఈఓ గాదె రామిరెడ్డి ఘనంగా సన్మానించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంచికల్లు గ్రామంలోని శివాలయంలో స్వామివార్లకు అర్చకులు ఎస్. శ్రీనివాస శర్మ నేతృత్వంలో, పాలువాయి గ్రామంలో అతి పురాతనమైన మహిమ కలిగిన శ్రీ గంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయానికి నూతన శోభ



అంకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణం



ధ్వజ స్తంభం వద్ద అభివృద్ధి పనులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉన్న పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయం నూతన శోభను సంతరించుకుంది. కారెంపూడి గ్రామ మాజీ మునసబు పలిశెట్టి కోటేశ్వరరావు, వీఆర్వో పలిశెట్టి కొండ శిథిలావస్థలో ఉన్న అమ్మవారి ఆలయ పైకప్పుకు స్లాబు వేయించారు. అమ్మవారి ఆలయంతో పాటు పక్కనే ఉన్న 11వ శతాబ్దకాలం నాటి సూరేశ్వరాలయానికి వినాయకుని గుడికి పైకప్పులు వేయించారు. అమ్మవారి ఆలయంలో బోరు వేయించి ట్యాంక్, పైపులైన్ ఏర్పాటు చేయించారు. ఇందుకు వారు రూ.4 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఇదిలా ఉంటే ఆలయం ముందు ధ్వజస్తంభానికి వెలుగూరి శ్రీనివాసరావు నూతన శోభను చేకూర్చారు. ధ్వజస్తంభం చుట్టూ గ్రానైట్ వేసి స్టీల్ రెయిలింగ్‌తో ఆకర్షణీయంగా చేశారు. అలాగే ఆలయం ముందు గ్రామ బొడ్రాయిని చలువాది మాధవరావు సుందరీకరించారు. ఇందుకు వారు సుమారు రూ.2 లక్షల దాకా ఖర్చు చేశారు. దీంతో అమ్మవారి ఆలయ ప్రాంతం ఆకర్షణీయంగా మారింది. త్వరలో వీరారాధన ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో వీరు చేయించిన అభివృద్ధి పనులు సౌకర్యంగా మారనున్నాయి.

సీసీఐ కేంద్రాలను ఉపయోగించుకోండి

పిడుగురాళ్ల: రైతులు సీసీఐ కేంద్రాలను సద్వినియోగ పరుచుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న అమరలింగేశ్వర పత్తి మిల్లులో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ... పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ఈ సీసీఐ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే పట్టణంలోని ఆర్‌టీసీ డిపోలో పల్లె వెలుగు బస్సును ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు, కార్మికులకు సర్వీసులను సక్రమంగా నిర్వహించి, పిడుగురాళ్ల డిపోకు మంచి పేరు తీసుకొని



సీసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రావాలని తెలిపారు. అలాగే పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 19 మందికి రూ. 25 లక్షల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో డెంగీ దూరం

రెంటచింతల: దోమల నివారణతో డెంగీ అరికట్టడం సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. సోమవారం మండలంలోని రెంటాల గ్రామంలో క్షేత్రస్థాయిలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో కలిసి ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ఏడిస్ లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కసారిగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, కండరాలు నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై దద్దుర్లు, కనుగుడ్డును కదపలేనంతగా నొప్పి వంటి లక్షణాలు కన్పించిన అవి డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు దరిచేరవని దీంతో దోమలను నివారిస్తే డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో లార్వాను గుర్తిస్తున్న అంకమ్మరావు

జంగాకు సన్మానం

పిడుగురాళ్ల: తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుడిగా నియమితులైన జంగా కృష్ణమూర్తిని మైనార్టీ నాయకులు సన్మానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జంగా కృష్ణమూర్తికి జిల్లా మైనార్టీ నాయకులు సయ్యద్ అమీర్ అలీ ఆధ్వర్యంలో దుశాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు చింతలపల్లి హసన్ అహ్మద్, షేక్ తుల్లా, ముజీబ్, సయ్యద్ ఇర్షాద్, షేక్ రఫీ, తాజ్ ఉద్దీన్, ఆఫీసాన్, షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు